## సింగరేణి కార్మికుల సమస్యలు పరిష్కరిస్తా

**బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి సండ్ర వెంకటవీరయ్య**



సింగరేణీయులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి సండ్ర

సత్తుపల్లి, నవంబర్ 24: కొత్తగూడెం సింగరేణి ఏరియా పరిధిలోని కిష్టారం ఓసీ, జేవీఆర్ ఓసీల పరిధిలో పనిచేస్తున్న కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను గెలిపించాలని ఎమ్మెల్యే అభ్యర్థి సండ్ర వెంకటవీరయ్య కోరారు. టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు ఎండీ రజాక్‌తో కలిసి శుక్రవారం ఆయన సింగరేణి ప్రాంతంలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన మాట్లాడారు. సమస్యల పరిష్కారం బీఆర్ఎస్, టీబీజీకేఎస్‌తోనే సాధ్యమవుతుందన్నారు. రజాక్ మాట్లాడుతూ.. కార్మికుల పక్షాన నిలిచే బీఆర్ఎస్‌కు ఓటు వేసి గెలిపించాలని కోరారు. వారి వెంట మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేశ్, టీబీజీకేఎస్ నాయకులు చెన్న కేశవరావు, మాధవరెడ్డి, రమేశ్‌బాబు, శ్రీనివాసరావు, ఉపేంద్రాచారి, క్రాంతి, మురళి, బానోతు శ్రీనివాస్, భరత్, కిరణ్, కోటి, నరేందర్, దీపక్, యూసఫ్, రఫీ పాల్గొన్నారు.

## ఈవీఎంల కమిషనింగ్ ప్రక్రియ పక్కా ఉండాలి

**భద్రాద్రి కలెక్టర్ ప్రియాంక**



కమిషనింగ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రియాంక

భద్రాద్రి కొత్తగూడెం, నవంబర్ 24 (నమస్తే తెలంగాణ): ఎన్నికల అధికారులు ఈవీఎంల కమిషనింగ్ ప్రక్రియను పక్కాగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రియాంక ఆల ఆదేశించారు. జిల్లాకేంద్రంలోని రామచంద్ర ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో చేపడుతున్న ఈవీఎం, వీవీ ప్యాట్ల ర్యాండమైజేషన్, కమిషనింగ్ ప్రక్రియను శుక్రవారం ఆమె తనిఖీ చేసి సిబ్బందికి సూచనలిచ్చారు. కమిషనింగ్ ప్రక్రియ పూర్తయిన తర్వాత సీల్ తప్పనిసరి అన్నారు. సీరియల్ నంబర్లు, అభ్యర్థుల పేర్లు, కేటాయించిన గుర్తులు ఏర్పాటు ప్రక్రియను సీసీ కెమెరాల్లో నిక్షిప్తం చేయాలన్నారు. ప్రక్రియ అంతా రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో నిర్వహించాలన్నారు. 29న నిర్వహించనున్న మెటీరియల్ రిసెప్షన్ కేంద్రం వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. కలెక్టర్ వెంట డీఆర్వో శిరీష, తహసీల్దార్లు పుల్లయ్య, నాగరాజు ఉన్నారు.

**28వరకు పోస్టల్ బ్యాలెట్ వినియోగం..**

కొత్తగూడెం టౌన్, నవంబర్ 24 : పోలింగ్ విధులు కేటాయించిన సిబ్బంది శుక్రవారం 939 మంది పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి ప్రియాంక ఆల తెలిపారు. పినపాకలో 308 మంది, ఇల్లెందులో 118, కొత్తగూడెంలో 211, అశ్వారావుపేటలో 221, భద్రాచలంలో 81 మంది వినియోగించుకున్నారు. రిటర్నింగ్ అధికారులు కార్యాలయంలో పోస్టల్ బ్యాలెట్ ఓటుహక్కు వినియోగానికి ఐదు నియోజకవర్గ కేంద్రాల్లోని ఆర్వో కార్యాలయాల ద్వారా పోస్టల్ బ్యాలెట్ తీసుకున్న సిబ్బంది అదే రిటర్నింగ్ అధికారి కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ కేంద్రాల్లో తమ ఓటుహక్కు వినియోగించుకున్నారన్నారు. ఈ నెల 28వ తేదీ వరకు పోస్టల్ బ్యాలెట్ వినియోగానికి సమయం ఉందని పేర్కొన్నారు.

## 'పాలిటెక్నిక్ స్పోర్ట్స్ మీట్' షురూ

కొత్తగూడెం ఎడ్యుకేషన్, నవంబర్ 24: కొత్తగూడెంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో శుక్రవారం అంతర జిల్లా పాలిటెక్నిక్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్ పోటీలు ప్రారంభమయ్యాయి. సింగరేణి ఏరియా జీఎం శాలెంరాజు ముఖ్యఅతిథిగా క్రీడాపోటీలను ప్రారంభించారు. పోటీల్లో ఉభయ జిల్లాల పరిధిలోని తొమ్మిది పాలిటెక్నిక్ కాలేజీలకు చెందిన క్రీడాకారులు అథ్లెటిక్స్, కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, బ్యాడ్మింటన్, టేబుల్ టెన్నిస్ పోటీల్లో తలపడ్డారు.



పోటీలను ప్రారంభిస్తున్న ఏరియా జీఎం శాలెంరాజు

# ప్రజల మధ్యే ఉంటా..సేవకుడినై పనిచేస్తా



- ప్రజలకు ఉపయోగపడే ప్రతి పనిని చేసి చూపించా..
- రహదారులు నిర్మించా.. సర్కార్ దవాఖానలను బలోపేతం చేశా
- సత్తుపల్లికి నర్సింగ్, పాలిటెక్నిక్ కళాశాలలు తీసుకొచ్చా..
- ప్రజలే నన్ను గెలిపించుకుంటారు: ఎమ్మెల్యే అభ్యర్థి సండ్ర వెంకటవీరయ్య

**నమస్తే ఇంటర్వ్యూ**

ఖమ్మం, నవంబర్ 24 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): నిత్యం ప్రజల మధ్యే ఉంటూ, వారికి సేవకుడిలా పనిచేస్తానని, ఎన్నికల్లో గెలిచిని సత్తుపల్లి నియోజకవర్గంలో మరిన్ని అభివృద్ధి పనులు చేపడతానని బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి సండ్ర వెంకటవీరయ్య అన్నారు. శుక్రవారం ఆయన 'నమస్తే'తో ముచ్చటించి పలు విషయాలను వెల్లడించారు. నియోజకవర్గం నుంచి వరుసగా మూడుసార్లు ప్రాతినిధ్యం వహించానని, ప్రజలు నాలుగోసారీ తనకే పట్టం కడతారని ధీమా వ్యక్తం చేశారు. తాను మాటల మనిషిని కానని, చేతల మనిషనని స్పష్టం చేశారు. కాగితాలకే పరిమితమయ్యే వాగ్దానాలు తానెప్పుడూ చేయలేదని, తాను ప్రజలకు మంచి అనుకున్నా ప్రతి పనిని చేసి చూపించానన్నారు. ప్రజల హృదయాల్లో తనకు సుస్థిర స్థానం ఉందన్నారు. ప్రజలే తనను ఎన్నికల్లో గెలిపించుకుని, గుండెల్లో పెట్టుకుంటారన్నారు.

**ప్రజల మధ్యే ఉన్నా..**

ప్రభుత్వ వైద్యాన్ని ప్రజలకు చేరువ చేసేందుకు కల్లూరు, సత్తుపల్లి, పెనుబల్లి ప్రభుత్వాసుపత్రులను 50 పడకల ఆసుపత్రిగా మార్చామని సండ్ర తెలిపారు. ఒకప్పుడు జిల్లా కేంద్రాలకు పరిమితమైన నర్సింగ్, పాలిటెక్నిక్ కళాశాలలను నియోజకవర్గానికీ తీసుకొచ్చానన్నారు. కేఎం బంజర నుంచి ఎల్ఎస్ బంజర వరకు ప్రధాన రహదారి నిర్మించామన్నారు. తాను ఏనాడూ శాసనసభ్యుడిగా హంగూ ఆర్భాటాలు చేయలేదని, ప్రజలు తమ కుటుంబ సభ్యుడిగా భావిస్తారన్నారు. సమస్యల్లో ఉన్న వారు నేరుగా తనను కలుస్తారన్నారు. తానూ ప్రజల మధ్యే ఉంటూ వారి కష్టసుఖాలు తెలుసుకుంటానన్నారు.


**గెలుపు నాదే..**

ప్రత్యర్థులు ఎన్ని ఎత్తులు వేసినా, ప్రజలు బీఆర్ఎస్‌కే ఓటు వేసి గెలిపిస్తారని, సత్తుపల్లిలో తన విజయం ఖాయమని సండ్ర ధీమా వ్యక్తం చేశారు. ఎన్నికల్లో గెలిచి సత్తుపల్లికి ఐటీ హబ్ తీసుకొచ్చేందుకు కృషి చేస్తానన్నారు. సత్తుపల్లి జిల్లాకేంద్రంగా జిల్లా ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. అలాగే కల్లూరును మున్సిపాలిటీగా మారుస్తామన్నారు. తాను 15 ఏళ్లు ఎమ్మెల్యేగా అభివృద్ధే ధ్యేయంగా పనిచేశానన్నారు. బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి కొనసాగింపు ఉంటుందని, ప్రజలు బీఆర్ఎస్‌కే పట్టం కడతారన్నారు. కేసీఆర్ మూడోసారి ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేస్తారన్నారు.

## మావోయిస్టులు ఆదివాసీలను హింసిస్తే ఉపేక్షించం

**భద్రాద్రి ఎస్పీ డాక్టర్ వినీత్ గంగన్న**

కొత్తగూడెం క్రైం, నవంబర్ 24: మావోయిస్టులు ఆదివాసీలను హింసిస్తే ఉపేక్షించమని భద్రాద్రి ఎస్పీ డాక్టర్ వినీత్ గంగన్న శుక్రవారం ఓ ప్రకటనలో హెచ్చరించారు. మావోయిస్టుల వేధింపుల కారణంగా ఛత్తీస్‌గఢ్- తెలంగాణ సరిహద్దు గ్రామాల్లో నివసించే ఆదివాసీలు వంట చెరుకు తెచ్చుకునేందుకు, అడవిలో పశువులను మేపేందుకూ భయపడుతున్నారన్నారు. అడవుల్లో ప్రెషర్ బాంబులు, బూబీ ట్రాప్స్‌ను అమరుస్తూ వారికి ప్రాణహాని తలపెడుతున్నారన్నారు. ఇక నుంచి ఏజెన్సీ ప్రాంతాల్లో భద్రతా చర్యలను మరింత కట్టుదిట్టం చేస్తామన్నారు. ఈనెల 20న దుమ్ముగూడెం మండలం పెద్ద నల్లబెల్లికి చెందిన పూసం రాకేష్, గోపాల్ అనే ఇద్దరు ఆదివాసీలను నిర్బంధించి, వారి నుంచి మావోయిస్టులు నిత్యావసరాలు అపహరించారన్నారు. ప్రెషర్ బాంబ్ పేలి ఈనెల 21న ఛత్తీస్‌గఢ్‌లోని పామేడ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ ఆదివాసీ తీవ్రంగా గాయపడ్డాడని, ఇటీవల చర్ల మండలం పూసుగుప్పలో ప్రెషర్ మైన్ పేలి పాడి రైతు ఆవు మృతిచెందిందన్నారు. ప్రజల కోసమే పోరాటం చేస్తున్నామని చెప్తూ మావోయిస్టులు వారినే పొట్టనపెట్టుకుంటున్నారని, చిరువ్యాపారులను దోచుకుంటున్నారని పేర్కొన్నారు. మావోయిస్టుల అమానుష తీరును పౌర సంఘాలు, ప్రజాప్రతినిధులు, మీడియా ప్రతినిధులు ఖండించాలని పిలుపునిచ్చారు.




## కాపర్ కేబుల్ స్వాధీనం

రామవరం, నవంబర్ 24: సింగరేణి యాజమాన్యం మందమర్రి నుంచి సత్తుపల్లికి కాపర్ కేబుల్ తరలిస్తుండగా ఓ డ్రైవర్ దానిలో కొంత భాగాన్ని అక్రమంగా తీసుకుని ఇంట్లో దాచాడు. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న పోలీసులు డ్రైవర్ ఇంటికి వెళ్లి కేబుల్‌ను స్వాధీనం చేసుకున్నారు. సింగరేణి ఎస్ఎస్వో రమణారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మందమర్రి నుంచి పొన్నం ప్రభాకర్ అనే డ్రైవర్ ఇటీవల లారీలో సత్తుపల్లికి కాపర్ కేబుల్‌ను తీసుకొచ్చాడు. డ్రైవర్ కేబుల్ కొంత భాగాన్ని కత్తిరించి రామవరం ఎస్సీబీ నగర్‌లోని తన ఇంట్లో భద్రపరిచాడు. విషయం తెలుసుకున్న స్థానికులు పోలీసులు, ఎస్అండ్‌పీసీకి సమాచారం ఇచ్చారు. శుక్రవారం పోలీసులు డ్రైవర్ ఇంటికి వెళ్లి సోదా చేసి కేబుల్‌ను స్వాధీనం చేసుకున్నారు.

### రామాలయంలో
## క్షీరాబ్ది ద్వాదశి వేడుకలు



జగన్మోహినిగా స్వామివారు

భద్రాచలం, నవంబర్ 24: రాక్షసులు, దేవతలు కలిసి అమృతం కోసం పర్వతాన్ని చిలికినప్పుడు బయటకు వచ్చిన అమృతాన్ని రాక్షసులకు దక్కకుండా దేవతలకు పంచాలని శ్రీమన్నారాయణుడు జగన్మోహినిగా మారి రాక్షసులను ఏమార్చి దేవతలకు అమృతాన్ని పంచుతాడు. ఆ పంచిన రోజే క్షీరాబ్ది ద్వాదశి. ఏటా కార్తీక మాస శుక్లపక్ష శుక్రవారం రోజు భద్రాచలంలోని సీతారామచంద్రస్వామి అర్చకులు, అధికారులు ఆలయంలో క్షీరాబ్ది ద్వాదశి వేడుకలు నిర్వహిస్తారు. దీనిలో భాగంగా అర్చకులు భద్రుడి మండపంలో ఉత్సవ మూర్తులను అభిషేకించారు. స్వామివారిని జగన్మోహినిగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు.

### అమెరికా వైస్ ప్రెసిడెంట్‌ను
## కలవనున్న 'శ్యామల'

పాల్వంచ, నవంబర్ 24 : అమెరికా వైస్ ప్రెసిడెంట్ కమలా హారిస్‌ను పాల్వంచకు చెందిన ప్రముఖుడు, శ్యామల గోపాలన్ ఎడ్యుకేషనల్ ఫౌండర్, చైర్మన్ నల్లా సురేష్ రెడ్డి కలవనున్నారు. ఆమె తన పర్సనల్ ఈవెంట్‌లో సన్నిహితులతో కలిసి నిర్వహించే సమావేశానికి హాజరుకావాలని ఇండియాలోని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచకు చెందిన ప్రముఖ విద్యావేత్త నల్లా సురేశ్‌రెడ్డికి ఆహ్వానం పంపించారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఒక ప్రకటనలో విలేకరులకు వివరాలు వెల్లడించారు. గత ఏడాది డిసెంబర్‌లో కమల హారిస్‌తో భేటీ అయిన సురేశ్‌రెడ్డికి మరోసారి కలిసే అవకాశం రావడం పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

### స్విమ్మింగ్‌లో
## విద్యార్థులకు పతకాలు

కొత్తగూడెం ఎడ్యుకేషన్, నవంబర్ 24 : రాష్ట్ర స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం హైదరాబాద్ బాచుపల్లిలో రాష్ట్రస్థాయి ఈత పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో కొత్తగూడేనికి చెందిన విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. కొత్తగూడెం నవభారత్ పబ్లిక్ స్కూల్‌కు చెందిన కొట్టె సాయిశ్రీవాత్సవ్ అండర్-17 బ్రేత్ స్ట్రోక్ విభాగంలో కాంస్య పతకం, సెయింట్ జోసెఫ్ స్కూల్‌కి చెందిన ఛత్రపతి అండర్-14 ఫ్రీ స్టైయిల్ విభాగంలో పతకం సాధించారు. నిర్వాహకులు మెడల్స్ అందించారు. క్రీడాకారులను పలువురు అభినందించారు. కొట్టె సాయిశ్రీవాత్సవ్‌ను నవభారత్ ప్రిన్సిపాల్ ఎంవీ శ్రీనివాసరెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. సీఈఆర్ క్లబ్ స్విమ్మింగ్ పూల్ కోచ్‌లు సామ్యూల్, రాంబాబు, సంధ్య, హనుమంతరాజు, సామంత్ ఆనందం వ్యక్తం చేశారు.